## క్లుప్తంగా

### జీఎంకు వినతిపత్రం



జీఎం జాన్‌ఆనంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఇల్లెందు: సింగరేణి ఉద్యోగాలకు విడుదలైన నోటిఫికేషన్‌లో మార్పులు చేయాలని ఇల్లెందు ఏరియా సింగరేణి మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ కోరింది. మంగళవారం అసోసియేషన్ అధ్యక్షుడు గుగ్గిళ్ల యాదగిరి ఏరియా జీఎం జాన్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన తెలిపిన వివరాలు... మేనేజ్‌మెంట్ ట్రైనీ (పర్సనల్)లో కొన్ని మార్పులు చేయాలని, సింగరేణిలో ఉద్యోగం చేస్తున్న చాలామంది ఉద్యోగులు ఒకప్పుడు ఆర్థిక పరిస్థితి బాగలేక రెగ్యులర్‌గా చదువుకోలేకపోయారని తెలిపారు. అలాంటి వారి కోసం రెగ్యులర్ అని కాకుండా ఎక్స్‌టర్నల్ డిస్టెన్స్ అండ్ ఓపెన్ విధానంలో చదివి ఉత్తీర్ణులైన వారికి కూడా అవకాశం కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వీరన్న, మణి, రవీంద్రకుమార్, మనోజ్‌కుమార్, దరియా సింగ్ తదితరులు ఉన్నారు.

### ఎస్‌ఐకి సన్మానం



శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న లక్ష్మీపురం గ్రామస్తులు

టేకులపల్లి: బోడు ఎస్‌ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పి.శ్రీకాంత్‌ను టేకులపల్లి మండలం కొప్పురాయి పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన యూత్, గ్రామ పెద్దలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దొర పూనెం వీరస్వామి, పూనెం బొర్రయ్య, కల్తి స్వామి, కుంజ రవి, చీమల భద్రయ్య, ఇర్ప రమేష్, ముడిగ వంసత్‌రావు, ఇర్ప చిరంజీవి, కుంజ నాగార్జున, పోరండ్ల నవీన్‌కుమార్, కుంజ కోటి పాల్గొన్నారు.

### సోమలింగేశ్వరాలయం చైర్మన్‌కు...



కోటేశ్వరరావును సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

జూలూరుపాడు: కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా సెక్రటరీ కొదుమూరి కోటేశ్వరరావును మంగళవారం పాపకొల్లులో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సన్మానించారు. పాపకొల్లు శ్రీ ఉమాసోమలింగేశ్వరాలయం చైర్మన్ కోటేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ సెక్రటరీగా ఇటీవల నియమితులయ్యారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావును కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నున్నా కృష్ణయ్య, అరిగెల నరసింహారావు, బానోత్ నవీన్, గుగులోత్ శ్రీనివాసరావు, వాంకుడోత్ కిషన్ నాయక్, ధర్మరాజుల వెంకటనారాయణ, రామిశెట్టి వీరయ్య, భూక్యా అమృ, మద్దిశెట్టి వంశీ, ముళ్లపాటి అప్పారావు, మంగ్యా పాల్గొన్నారు.

# మూడుసార్లు శంకుస్థాపన!

- నాసిరకంగా కిన్నెరసానివాగు బ్రిడ్జి నిర్మాణం
- 11ఏళ్లల్లో ముగ్గురు ఎమ్మెల్యేలు మూడుసార్లు నిర్మాణ పనులు ప్రారంభం
- ఇబ్బంది పడుతున్న 24 గిరిజన గ్రామాల ప్రజలు
- ఈ వర్షాకాలానికైనా పూర్తయ్యేనా?



యానంబైల్, రాజాపురం గ్రామాల మధ్య అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి

పాల్వంచరూరల్: 11సంవత్సరాల క్రితం కిన్నెరసాని వాగుపై ప్రారంభమైన బ్రిడ్జి నిర్మాణ పనులు నేటికీ పూర్తి కాలేదు. మండలంలోని రాజాపురం, యానంబైల్ గ్రామాల మధ్య కిన్నెరసాని వాగుపై వర్షాకాలంలో కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఎత్తితే వరద ప్రవాహంతో ఎగువన ఉన్న 24 గిరిజన గ్రామాల రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఈ నేపథ్యంలో 2014లో బ్రిడ్జి నిర్మాణానికి రూ.9.70 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పనులు కూడా ప్రారంభించారు కానీ, ఏం జరిగిందో ఏమో బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ముగ్గురు ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు చేసిన బ్రిడ్జి

**ముచ్చటగా మూడుసార్లు శంకుస్థాపన...**

కిన్నెరసానివాగుపై రాజాపురం, యానంబైల్ గ్రామాల మధ్య మంజూరైన బ్రిడ్జి నిర్మాణ పనులకు అప్పటి, ఇప్పటి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, తరువాత జలగం వెంకట్రావ్, ఆ తరువాత వనమా వెంకటేశ్వరరావు మూడుసార్లు ఎవరి హయాంలో వాళ్లు శంకుస్థాపన చేశారు. అయినా నేటికీ పూర్తి కాలేదు అంటే ఆ విడ్డూరాన్ని అర్థం చేసుకోవచ్చు. 2023లో పూర్తి చేయాల్సిన బ్రిడ్జి పనులు పూర్తి కాకపోవడంతో.. గడువు పొడిగించారు. ఈ ఏడాది జూన్ వరకు పూర్తి చేయాల్సి ఉండగా పనులు పూర్తయ్యేది ఎప్పుడని సర్వత్రా చర్చలు నడుస్తున్నాయి.

**ఆగుతూ సాగుతున్న పనులు...**

బ్రిడ్జి నిర్మాణానికి పిల్లర్ల పనులు పూర్తి చేశారు. స్లాబ్ వేయాల్సి ఉంది. అంతేకాకుండా అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. వర్షాకాలంలో పనులను నిలిపివేశారు.

నిర్దేశించిన గడువులో బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే చంద్రాలగూడెం, మల్లారం, రేగులగూడెం, ఉలవ్వనూరు, మందేరకలపాడు, సారెకల్లు, సత్యనారాయణపురం, యానంబైల్ గ్రామ పంచాయతీలోని గిరిజన గ్రామాల ప్రజలకు వర్షాకాలం కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాకపోకలు కొనసాగించే అవకాశం ఉంటుంది. అదే జరిగితే గిరిజన ప్రజల కష్టాలు తీరనున్నాయి.

**నత్తనడకన బ్రిడ్జి నిర్మాణ పనులు...**



రూ.కోట్ల వ్యయంతో యానంబైల్, రాజాపురం గ్రామాల మధ్య చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. వచ్చే వర్షాకాలనికైనా పూర్తి చేస్తారో లేదో. 11 ఏళ్ల క్రితం బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారు.

– మల్లయ్య, మామిడిగూడెం

**రాకపోకలకు ఇబ్బందిగా ఉంది...**



బ్రిడ్జి నిర్మాణ పనులు నాలుగు నెలలుగా నిలిపివేశారు. వర్షాకాలంలో గిరిజన గ్రామాల ప్రజలు పాల్వంచ మండల కేంద్రానికి రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అధికారులు స్పందించి పనులు పూర్తిచేయించాలి.

– నాగేశ్వరరావు, ఉల్వనూరు కొత్తూరు

**గడువులోగా పూర్తి చేస్తాం...**



రాజాపురం, యానంబైల్ గ్రామల మధ్య కిన్నెరసాని వాగుపై మంజూరైన బ్రిడ్జి నిర్మాణ పనులు 2021లో ప్రారంభమయ్యాయి. 2023లోనే పూర్తి కావాల్సి ఉంది. ఈ ఏడాది జూన్ నాటికి అన్ని పనులు పూర్తి చేస్తాం.

– వంశీ, ఆర్అండ్‌బీ ఏఈ

# అన్నిరంగాల్లో అభివృద్ధికి ప్రణాళిక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ: కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలను కలుపుకుని కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జిల్లా కేంద్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికా బద్ధంగా ముందుకెళుతున్నట్లు తెలిపారు. ఎన్ఎండీసీ కర్మాగారాన్ని పునరుద్ధరించేందుకు, పాల్వంచలోని 999, 444, 817, 999, 727 సర్వే నంబర్లలో గతంలో మాదిరిగా రిజిస్ట్రేషన్లు జరిగేలా కృషి చేస్తానన్నారు. పాల్వంచ మున్సిపాలిటీని వంద పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దడంతో పాటు డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. మెడికల్ కళాశాల భూమి ఇతర 300 ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు తీసుకున్నారని, మిగులు 200 ఎకరాలు ఉండే అవకాశం ఉందని అందులో జేఎన్‌టీయూ యూనివర్సిటీగా వచ్చేలా ప్రయత్నం జరుగుతోందన్నారు. సబ్‌జైల్ మంజూరు అయ్యేలా చూస్తానన్నారు. జిల్లా కేంద్రానికి అవసరమైన అన్ని వసతులు కల్పించడమే తన లక్ష్యం అన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి, తహసీల్దార్ వివేక్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, విశ్వేశ్వరరావు, యర్రంశెట్టి ముత్తయ్య, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవ పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీఓడబ్ల్యూ నాయకులు

ఇల్లెందురూరల్: కొల్లాపురం గ్రామంలో మహిళా పోరాట దినోత్సవ పోస్టర్లను పీఓడబ్ల్యూ నేతలు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి మోకాళ్ల సుగుణ మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మహిళలపై దాడులు పెరుగుతున్నాయని, దీనికి మోదీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను సైతం హరించి వేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేస్తూ మహిళలను వంటింటి కుందేలుగా మార్చే కుట్ర చేస్తోందని ధ్వజమెత్తారు. పలు రాష్ట్రాలలో చోటుచేసుకుంటున్న అత్యాచారాలు ఇందుకు ప్రత్యక్ష నిదర్శనంగా పేర్కొన్నారు. ఈనెల 8న నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని 114వ పోరాట దినోత్సవంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమ్మక్క, కళ్యాణి, సుమ, లక్ష్మి, సుజాత, కలమ్మ, సుక్కమ్మ, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతులు కల్పించండి..




ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గుడిసెవాసులు

ఇల్లెందురూరల్: మండలంలోని రాజీవ్‌నగర్‌తండా గ్రామ శివారులో పేదలు వేసుకున్న గుడిసెలకు కనీస సౌకర్యాలు సమకూర్చాలని కోరుతూ ఆప్రాంత వాసులు సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీపీ చీమల నాగరత్నమ్మలకు అందజేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో పేదలందరూ 2019లోనే గడిసెలు వేసుకున్నారని, నాటి నుంచి సౌకర్యాలు కల్పించాలని పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా ఎవరూ స్పందించడం లేదన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి పేదలకు గుడిసెల స్థానంలో పక్కా ఇళ్లు మంజూరు చేయాలని అందుకు స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని కోరారు. కాలనీలో సీసీ రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మద్దెల వీరస్వామి, వీరభద్రం, వెంకన్న, ఆనంద్, నర్సయ్య, నీలారాణి, సుజాత, కోటమ్మ, కౌసల్య తదతరులు పాల్గొన్నారు.

### నేడు రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్

టేకులపల్లి: ఇక నుంచి ప్రతి వారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు ఆధునిక సాంకేతికతపై అవగాహన కల్పించేందుకు ప్రతీ మండలంలో ప్రభుత్వం వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. పైలట్ కార్యక్రమంలో భాగంగా టేకులపల్లి మండలం పరిధిలోని ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌లోని రైతు వేదిక దృశ్య శ్రవణ కార్యక్రమానికి ఎంపికైంది. ఈ మేరకు బుధవారం ఉదయం 11 గంటలకు రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ పరికరాలను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభిస్తారని టేకులపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి అన్నపూర్ణ మంగళవారం తెలిపారు. హైదరాబాద్ నుంచి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లైవ్‌లో ప్రారంభిస్తారని, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇతర రాష్ట్రస్థాయి వ్యవసాయ శాఖ అధికారులు లైవ్‌లో పాల్గొంటారని తెలిపారు. ఎంపీడీఓ, తహసీల్దార్, హార్టికల్చర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, నీటిపారుదల శాఖ ఇంజనీర్, విద్యుత్ శాఖ ఇంజనీర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ, ప్రాథమిక సహకార సంఘం సీఈఓలు హాజరు కావాలని కోరారు.

### మహా శివరాత్రికి ముస్తాబు



సుజాతనగర్‌లోని శివాలయం

సుజాతనగర్: సుమారు 500 సంవత్సరాల చరిత్ర గలిగిన సుజాతనగర్‌లోని స్వయంభు శ్రీ సోమేశ్వర స్వామి దేవస్థానం అతి ప్రాచీన శైవక్షేత్రంగా ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రధాన కాశీ ఆలయానికి ఉత్తరం వైపున గంగా నది ఎలా ప్రవహిస్తూ ఉంటుందో.. అచ్చం అలానే ఈ ఆలయానికి ఉత్తర దిశలో ఎదుళ్ల వాగు ఉండటం ఇక్కడి విశేషం. ఈ ఆలయం భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా మారింది. ప్రత్యేకంగా కార్తీక, శ్రావణమాసాలు, మహాశివరాత్రి, పర్వదినాల సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతుంటాయి. ఈనెల 8న మహాశివరాత్రి సందర్భంగా 3 రోజుల పాటు పూజలు ఘనంగా జరగనున్నాయి. మండలంలో ఏకైక శివాలయం కావడంతో చుట్టుపక్కల గ్రామాలతో పాటు, కొత్తగూడెం, చంద్రుగొండ, ఏన్కూరు, జూలూరుపాడు, తల్లాడ తదితర మండలాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ అన్నపురెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు.

# సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

ఇల్లెందు: ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలను జమ చేసినందుకు కృతజ్ఞతగా నాలుగో తరగతి ఉద్యోగులు మంగళవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో తమకు వేతనాలు ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి ఉండేదని, నేడు 1వ తేదీనే వేతనాలు విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షుడు ముస్తఫాఖాన్, ఉపాధ్యక్షుడు నయీమ్, కార్యదర్శి గౌస్‌పాషా, ఉద్యోగులు పాల్గొన్నారు.

# కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలి



మాట్లాడుతున్న కనకేశ్

పాల్వంచ/పాల్వంచరూరల్: మున్నూరు కాపు తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలను వెంటనే రద్దు చేయాలని, అవి జారీ చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ మున్నూరు కాపు పటేల్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాంపెల్లి కనకేశ్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి వలస వచ్చిన తూర్పు కాపు, ఇతర కులాల వారికి కూడా మున్నూరు కాపు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారని ఆరోపించారు. దళారుల నుంచి డబ్బు దండుకుని సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని విమర్శించారు. మున్నూరు కాపులు కాకున్నా తప్పుడు పత్రాలు పొందడాన్ని ఖండిస్తున్నామని, అందుకు తమ వద్ద ఆర్టీఏ ద్వారా సేకరించిన ఆధారాలు ఉన్నాయని, కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో ఆకుల ఆనంద్, మెడిశెట్టి సాంబశివరావు పటేల్, తోట ప్రవీణ్, తోట లోహిత్, సాయి పటేల్ పాల్గొన్నారు.

# ‘గృహజ్యోతి’కి ఎదురుచూపులు

సుజాతనగర్: రాష్ట్ర వ్యాప్తంగా గృహజ్యోతి పథకం అమల్లోకి వచ్చింది. ఈ క్రమంలో 200 యూనిట్లు లోపు విద్యుత్ వాడకం ఉన్న వారికి జీరో విద్యుత్ బిల్లులు వస్తుండగా... సుజాతనగర్‌లో మాత్రం జీరో బిల్స్ రాకపోవడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు. మంగళవారం మీటర్ రీడింగ్‌ను తీసిన విద్యుత్ సిబ్బంది... జీరో బిల్లులకు బదులుగా పేమెంట్ బిల్లులు ఇవ్వడంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తు, రేషన్‌కార్డు ఆధారంగా జీరో బిల్లులు రాకపోవడం ఏంటని విద్యుత్ సిబ్బందిని వినియోగదారులు ప్రశ్నించారు. ప్రభుత్వం చెప్పినట్లు తమకు రేషన్ కార్డు ఉందని, విద్యుత్ వినియోగం కూడా 200 యూనిట్లలోపు ఉండగా తామెందుకు గృహజ్యోతి పథకానికి అర్హులం కాదని ప్రశ్నిస్తున్నారు. స్పందించిన అధికారులు 200 యూనిట్లలోపు వాడకం ఉంటే బిల్లు వచ్చినా చెల్లించాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. మండల పరిషత్ సిబ్బంది ఆన్‌లైన్ చేసిన వారికే జీరో బిల్లులు వస్తున్నాయని, జీరో బిల్లులు రానివారు మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి తగిన వివరాలు అందజేయాలని సూచించారు.

# కల్లుగీత సొసైటీలను పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

సుజాతనగర్: ఏజెన్సీ ఏరియాల్లో కల్లుగీత సొసైటీలను పునరుద్ధరించడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్టుషాపులను తక్షణమే తొలగించాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో సుజాతనగర్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తరతరాల నుంచి ఏజెన్సీ ఏరియాల్లోని గ్రామాలలో గీత వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్న కల్లుగీత కార్మికుల సొసైటీలను రద్దు చేయడంతో వారు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ద్వారా వృత్తిదారులకు అందాల్సిన సంక్షేమ పథకాలు కూడా వీరికి అందడం లేదని వాపోయారు. గ్రామాలలో బెల్ట్‌షాపులు విపరీతంగా పుట్టుకరావడంతో లిక్కర్‌తో ప్రజల ఆరోగ్యాలు దెబ్బతినడంతో పాటుగా ఆర్థికంగా కుంగిపోతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా బెల్టుషాపులను పూర్తిగా తొలగించాలని, ప్రకృతి పానీయం కల్లును ప్రోత్సహించాలని, ప్రతి సొసైటీకి చెట్ల పెంపకానికి 5 ఎకరాలు ప్రభుత్వ భూమి ఇవ్వాలని, తాటి, ఈత, జీలుగు, ఖర్జూర తదితర కల్లునిచ్చే చెట్లు నాటాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కల్లుగీత కార్మికులు బెజవాడ సత్యం, నాగేంద్ర, ఆకుల లక్ష్మయ్య, బొమ్మగాని శ్రీకాంత్, మాచర్ల నరసయ్య, కక్కిరేణి వీరయ్య, గుండెబోయిన ఈశ్వర్, బెజవాడ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వాసవీ, వనితా క్లబ్‌ల కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న క్లబ్ సభ్యులు

పాల్వంచ: పాల్వంచ వాసవీ క్లబ్, వనితా క్లబ్‌ల కమిటీ ప్రమాణ స్వీకారాన్ని మంగళవారం స్థానిక జీఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు చలవాది ప్రకాశ్, డాక్టర్ పెండ్యాల రోజాలక్ష్మి, తాటికొండ సురేశ్‌ల ఆధ్వర్యంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా గూడెపు శ్రీనివాస్, కార్యదర్శి మహంకాళి సాయి, కోశాధికారిగా చిదిరాల ఉమాశంకర్, వనిత క్లబ్ అధ్యక్షురాలిగా గుబ్బదుర్గా, సెక్రటరీ పొన్నూరి శ్రీదేవి, ట్రెజరర్ అర్వపల్లి లక్ష్మి, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ చలవాది రాజ్యలక్ష్మి, శ్రీలత, రేపాక పద్మజ, వంకదార ఇందిర, జూలూరి మల్లేశ్, జూలూరి మణి, మునీల, భార్గవి, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమ్మెల్యే తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య



పసిపిల్లల చికిత్స వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ డీవీ

ఇల్లెందు: నియోజకవర్గంలోని మండలాలతో పాటు పక్క జిల్లాల, మండలాల నుంచి ఇల్లెందు 100 పడకల ఆస్పత్రికి ప్రతీరోజు వందల మంది రోగులు వైద్యం, పరీక్షలు కోసం వస్తున్నారు. వారందరికీ మెరుగైన వైద్యం అందించాలి.. ప్రజలకు వైద్యం అందలేదనే భావన వారిలో కలగొద్దు.. సదుపాయాలు, ఉద్యోగులు, ఖాళీల భర్తీ కోసం ఉన్నతాధికారులతో తాను చర్చించి భర్తీ కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం ఇల్లెందు 100 పడకల ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. అక్కడి అన్ని వార్డులు, గదులను సందర్శించారు. పరికరాలను పరిశీలించి, రోగులతో ముచ్చటించారు. వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఏఏ సదుపాయాలు అవసరమో ఆరా తీశారు. ఎంతమంది పని చేస్తున్నారు.. ఖాళీల వివరాలు.. వాటి భర్తీ కోసం లేఖలు తయారు చేయాలని తన పీఏ రాజేష్‌కు సూచించారు. 100 పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం 5 ఎకరాల స్థలం అవసరం అవుతుందని సూపరింటెండెంట్ డాక్టర్ ఏ.వెంకన్న, ఆర్ఎంఓ డాక్టర్ హర్షవర్ధన్ ఎమ్మెల్యేకు వివరించారు. అంబులెన్స్ అవసరం ఉందని, పోస్టుమార్టం చేసేందుకు ఎవరూ లేరని, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స, ప్రసూతీ ఆపరేషన్లు చేసేందుకు మత్తు డాక్టర్ లేడని తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో పిచ్చి మొక్కలు తొలిగించాలని, శానిటేషన్ సదుపాయం, నీటి ఎద్దడి నివారణ కోసం మున్సిపల్ సహాయం తీసుకోవాలని విన్నవించారు. అనంతరం వైద్యులు, సిబ్బంది, ఏఎన్ఎం, స్టాఫ్ నర్సులతో సమావేశం నిర్వహించారు. వారికి రోజువారీగా ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, సూపరింటిండెంట్ డాక్టర్ ఏ.వెంకన్న, ఆర్ఎంఓ డాక్టర్ జి.హర్షవర్ధన్, డాక్టర్లు బన్సీలాల్, బావుసింగ్, సింధు, అమృత్, హర్ష, అజ్మత్, ప్రదీప్, హెడ్ సిస్టర్ ఫర్జానా బేగం, స్టాఫ్ నర్స్‌లు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

**100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి స్థల పరిశీలన..**

పట్టణంలోని ఆర్అండ్ఆర్ కాలనీలోని ప్రభుత్వ భూమిలో 100 పడకల ఆస్పత్రి నిర్మించేందుకు స్థల పరిశీలన చేశారు. మంగళవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావులు రెవెన్యూ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దార్ కె.రవికుమార్, ఆర్ఐ పద్మ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దానియేల్, మడుగు సాంబమూర్తి, సదానందం, పెద్దినేని హరినాథ్‌బాబు, వెంకన్న, పండు, జాన్సన్, రాకేష్, రాజు, సునీల్ ఉన్నారు.

# ఐదేళ్లుగా అందని పరిహారం

సుజాతనగర్: నాయకులగూడెం గ్రామానికి చెందిన చల్లా నరసింహారావు 2019 జూలైలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ రైతు కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం ఇంతవరకు అందలేదు. సుమారు ఐదేళ్లుగా పరిహారం కోసం ఆయా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నానని నరసింహారావు భార్య నాగమణి ఆవేదన వ్యక్తం చేస్తోంది. నరసింహారావుకు ఎకరంన్నర సొంత పొలం ఉండగా... దీనికి తోడు మరికొంత భూమిని కౌలుకు తీసుకుని మిర్చి, పత్తి, మొక్కజొన్న పంటలను సాగుచేశాడు. దిగుబడి సరిగా రాక అప్పులపాలైన క్రమంలో పురుగుమందు తాగి మృతి చెందాడు. ముగ్గురు కలెక్టర్లు, ముగ్గురు తహసీల్దార్లు మారినా పరిహారం అందకపోవడం కొసమెరుపు. ఇప్పటికైనా తన భర్త మృతికి సంబంధించిన పరిహారం ఇప్పించాలని నాగమణి ఉన్నతాధికారులను విజ్ఞప్తి చేస్తోంది.